నేడు ఆవిష్కరణ



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 29 :రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకావిష్కరణ సభకు ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ రచయిత్రి ఓల్గా పుస్తకాన్ని అవిష్కరిస్తారు. ప్రసిద్ధ ప్రచురణ సంస్థ ఎమెస్కో సంపాదకుడు డి. చంద్రశేఖరరెడ్డి పుస్తకాన్ని సమీక్షిస్తారు. ముఖ్య అతిథులుగా సీనియర్ పాత్రికేయులు మానుకొండ నాగేశ్వరరావు, ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు పాల్గొంటారు.

వేదిక : అమరరాజ ఆడిటోరియం, కరకంబాడి
సమయం : శుక్రవారం ఉదయం 10 గంటలకు

తెలుగు రాజకీయాల అంతరాత్మ కథ

గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర

ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య, సేవా రంగాల చరిత్రలో ఎన్నటికీ చెరగని పేరు పాటూరి రాజగోపాలనాయుడు. నిరాడంబరత, సేవాదృక్పథం, ఓరిమిగల రాజకీయం, గురుభక్తి, స్నేహశీలత వంటి ఉన్నత గుణాల సమాహారం ఆయన. పసి వయసునుంచే ఆయన చేయి పట్టుకుని నడిచిన తల్లిలేని బిడ్డ గల్లా అరుణకుమారి. పీయూసీతో ఆగిపోయిన చదువును, పెండ్లై భర్త రామచంద్రనాయుడు వెంట అమెరికా వెళ్లిన తర్వాత ఆమె కొనసాగించారు. నలభై ఏళ్ల కిందటే అమెరికాలో కంప్యూటర్స్ కోర్సు చేసి, ప్రసిద్ధ కార్ల కంపెనీలో తొమ్మిదేళ్లకు పైగా ఉద్యోగం చేశారు.పుట్టిన నేల మీద ఫ్యాక్టరీ పెట్టాలనే రామచంద్ర నాయుడు ఆలోచనలకు బాసటగా భర్తతో కలిసి తిరిగి వచ్చిన అరుణకుమారి అనుకోని పరిస్థితుల్లో పూర్తి ప్రతికూల వాతావరణంలో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఇక అక్కడి నుంచీ ఆమెది పోరాటమే. ప్రత్యర్థి పార్టీతో మాత్రమే కాదు, సొంత పార్టీలోనూ ఆమె తలపడక తప్పని పరిస్థితులనే ఎదుర్కొన్నారు.ఈ పరిణామాలన్నింటినీ గల్లా అరుణకుమారి అక్షరమక్షరం గుదిగుచ్చి స్వీయచరిత్రగా లిఖించారు. వెయ్యి పేజీల ఈ పుస్తకం నేడు తిరుపతిలో విడుదల అవుతోంది. వేలాదికోట్ల వ్యాపార సామ్రాజ్యంగా విస్తరించినా దిగువ మాఘం పల్లెబిడ్డగానే ఇప్పటికీ ఆమె మాటా, తీరూ ఉండడం విశేషం. పదహారేళ్లు ఆమెరికాలో ఉన్నా, ఇరవై ఏళ్లు ఎమ్మెల్యేగా, మూడు పర్యాయాలు మంత్రిగా చేసినా ఆమె గొంతులో ఇప్పటికీ చిత్తూరు యాస సొగసుగానే పలుకుతుంది.భారత దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించడానికి సరిగ్గా పదహైదు రోజుల ముందు పుట్టిన గల్లా అరుణకుమారి తల్లి కూడా పోరాట యోధురాలే. తెల్ల దొరలపై తిరుగుబాటుగా భర్త రాజగోపాలనాయుడు నడిపిన రాత పత్రికను ఆయన అరెస్టు తర్వాత కొనసాగించిన ధీరురాలు. నిండు చూలాలుగా జైలు శిక్ష అనుభవించి జబ్బుపడి విడుదలై బిడ్డను కన్న కొద్ది కాలానికే కన్నుమూసిన అమరావతి జ్ఞాపకాలను కడుపులో దాచుకున్న కన్నీటితో తన స్వీయచరిత్రలో నమోదు చేశారు అరుణకుమారి. రాజీవ్ గాంధీ నుంచి రాజకుమారి దాకా నిలదీసే స్వభావమే ఆమెను రాజకీయాల్లో నిరంతరం అస్థిరంగా ఉంచిందని ఈ పుస్తకం వెల్లడిస్తోంది. చిత్తూరు జిల్లాలో వివిధ ఎన్నికల్లో గ్రామాల్లో ఎదురైన సంఘటనలనూ, అప్పటి మనుషులనూ మరచిపోకుండా తన స్వీయచరిత్రలో ఆమె గుర్తు చేసుకున్నారు. కోట్ల విజయభాస్కరరెడ్డితో, వైఎస్ రాజశేఖరరెడ్డితో, చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దనరెడ్డి, చంద్రబాబు సహా పలువురు నాయకులతో విభేదించిన సందర్భాలనూ, వారి అభిమానం చూరగొన్న సమయాలనూ ఆమె రాశారు. తెలుగునేల మీద నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన రాజకీయాల ఆత్మగుట్టు విప్పి చెప్పారు అరుణకుమారి. సరళంగా కథలా సాగే గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర విడుదలయ్యాక వర్తమాన రాజకీయ నాయకులకు ఒక పాఠంగా ఉపయోగపడుతుంది.



- తిరుపతి, ఆంధ్రజ్యోతి

2,67,089మంది పింఛన్లకోసం రూ.113కోట్ల కేటాయింపు

రేపే పంపిణీకి విస్తృత ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్/విద్య), ఆగస్టు 29: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీని ఈనెల 31వ తేదీ ఉదయం ఆరు గంటలనుంచే ప్రారంభించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయాల సిబ్బందితో వర్చువల్‌గా సమావేశమయ్యారు. సెప్టెంబరు ఒకటో తేదీన ఆదివారం సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛను సొమ్మును ఉదయం ఆరు గంటల నుంచే ఇళ్ల వద్దకెళ్లి అందజేయాలన్నారు. ఇందుకోసం శుక్రవారం బ్యాంకుల నుంచి డబ్బు డ్రాచేసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గతంలో ఆలస్యంగా పంపిణీ చేసిన సచివాలయ సిబ్బందితో మాట్లాడి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఒక రోజులోనే వంద శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని చెప్పారు. ఏవైనా కారణాలతో మిగిలిన వారికి రెండో తేదీన అందజేయాలన్నారు. లబ్ధిదారులు కూడా శనివారం ఇళ్ల వద్దనే ఉండి పింఛను సొమ్ము తీసుకోవాలని కోరారు. జిల్లా, గ్రామ వార్డు సచివాలయ అధికారి సుశీలాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పథక సంచాలకులు ప్రభావతి, ఎల్డీఎం విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు. కాగా జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలో వితంతు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల తదితర లబ్ధిదారులు 2,67,089మంది ఉన్నారు. వీరికోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.113కోట్లను కేటాయించింది. అలాగే లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేయడానికి 5,827 సచివాలయ సిబ్బందిని నియమించారు.

బస్సు బోల్తా

ఏడుగురికి గాయాలు

పంట పొలంలో బోల్తాపడిన ఆర్టీసీ బస్సు



చిల్లకూరు, ఆగస్టు 29: చిల్లకూరు మండలం మోమిడి గ్రామ సమీపంలోని పొలాల్లో గురువారం ఓ ఆర్టీసీబస్సు బోల్తాపడి ఏడుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు...నెల్లూరు నుంచి ముత్తుకూరు మీదుగా 34మంది ప్రయాణికులతో కోటకు వెళుతున్న వాకాడు డిపో ఆర్టీసీ బస్సు మోమిడి గ్రామ సమీపంలో అదుపుతప్పి పొలాల్లోకి బోల్తాపడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న వాకాడు మండలం సింగనేటూరు గ్రామానికి చెందిన చిన్నమ్మ, చిల్లకూరు మండలం కొమరావారిపాళెం గ్రామానికి చెందిన అంకమ్మ, గుమ్మళ్లదిబ్బకు చెందిన హసీంబీ, ముంతాజ్, లింగవరానికి చెందిన ప్రవళ్లిక, తమ్మినపట్నానికి చెందిన వెంకటమ్మ, వరగలికి చెందిన నిఖితకు గాయాలయ్యాయి.వారిని చికిత్స నిమిత్తం వరగలి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడినుంచి చిన్నమ్మ, అంకమ్మలను మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన ప్రయాణికురాలు

రాజీవ్‌నగర్ కాలనీపై విచారణ వాయిదా

శ్రీకాళహస్తి, ఆగస్టు 29:శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్ కాలనీలో యేళ్ల తరబడి జరిగిన భూ అక్రమాలపై శుక్రవారం జరగాల్సిన సమగ్ర విచారణ సెప్టెంబరు 2వ తేదీకి వాయిదా పడిందని తహసీల్దారు లక్ష్మీనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీ జరగాల్సిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం సెలవురోజు కావడంతో ముందు రోజైన శనివారం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిశ్చయించిందని తెలిపారు. పింఛన్ల పంపిణీ కోసం శుక్రవారం నుంచే అధికారులు అవసరమైన ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాల్సి రావడంతో రాజీవ్‌నగర్‌లో అక్రమాలపై జరగాల్సిన సర్వే కార్యక్రమాన్ని సోమవారానికి వాయిదా వేసినట్లు వెల్లడించారు.

పలువురు ఎస్ఐలకు పోస్టింగ్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 29: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి, వీఆర్‌లో ఉన్న ఎస్ఐలకు పోస్టింగ్‌లు ఇస్తూ ఎస్పీ సుబ్బరాయుడు గురువారం ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి ఈస్ట్ ఎస్ఐగా ఇప్పటివరకు ఎంఆర్‌పల్లెలో పనిచేసిన నాగేంద్రబాబును నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డిని వీఆర్‌కు పంపారు. తొట్టంబేడుకు ఈశ్వర్‌ను, సత్యవేడుకు అలిపిరిలో పనిచేస్తున్న రామస్వామిని, అలిపిరిలో ఉన్న రాజశేఖర్‌ను వీఆర్‌కు, లోకేష్‌ను వీఆర్ నుంచి అలిపిరికి నియమించారు. ఇప్పటివరకు క్రైంలో పనిచేసిన సాయినాథ్ చౌదరిని తిరుచానూరు స్టేషన్‌కు నియమించారు.

చంద్రగిరి ఇన్‌చార్జి డీఎస్పీగా వెంకటనారాయణ

చంద్రగిరి ఇన్‌చార్జి డీఎస్పీగా తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణను నియమిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్న నరసింగప్ప సెలవుపై వెళ్లడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే తిరుపతి రూరల్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సాదిక్ ఆలీ సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి సీఐగా సునీల్‌కుమార్‌ను నియమించారు.

తెలుగులోనే మాట్లాడదాం : కలెక్టర్



భాషాకోవిదులతో కలెక్టర్, అధికారులు

తిరుపతి(విద్య), ఆగస్టు 29: మాతృభాషను గౌరవిద్దాం.. తెలుగు భాషలోనే మాట్లాడదాం అని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ శుభం భన్సల్, డీఆర్వో పెంచల కిషోర్ తదితర అధికారులతో కలిసి కలెక్టర్ గిడుగు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వ్యవహారిక భాషకు గిడుగు ప్రాణం పోశారని కలెక్టర్ చెప్పారు. జేసీ మాట్లాడుతూ.. తెలుగు భాష తీయనైనదని, కమ్మనైనదనీ కొనియాడారు. డీఆర్వో మాట్లాడుతూ.. తెలుగును సరళ భాషగా అందుబాటులోకి తీసుకొచ్చిన మహనీయుడు గిడుగు అని ప్రస్తుతించారు. అనంతరం పలువురు తెలుగు భాషా కోవిదులను సన్మానించారు. డీపీఆర్వో బాలకొండయ్య, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్స్‌లో రోగి అదృశ్యంపై పోలీసుల విచారణ



స్విమ్స్‌లో బాధితులను అడిగి వివరాలు సేకరిస్తున్న సీఐ రామకృష్ణ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 29 :తిరుపతి స్విమ్స్ శ్రీపద్మావతి భవనంలోని ఎంఐసీయూ వార్డులో చికిత్స పొందుతూ కనిపించకుండా పోయిన టి.సీతారామప్ప ఆచూకీ గురువారం కూడా లభించలేదు.అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్ప(65)కన్పించకపోవడంపై 'స్విమ్స్‌లో రోగి అదృశ్యం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన పోలీసులు, స్విమ్స్ యాజమాన్యం ఆస్పత్రి ఆవరణలో, పరిసర ప్రాంతాల్లో గురువారం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. డైరెక్టర్ ఆర్వీకుమార్ బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రోగి ఆచూకీ కోసం వెస్ట్ సీఐ రామకృష్ణ ఆయన బృందంతో కలిసి ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీతారమప్ప చికిత్స పొందుతున్న వార్డును పరిశీలించి అక్కడి సిబ్బందిని విచారించారు. స్విమ్స్ ఆవరణలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. స్విమ్స్ సెక్యూరిటీ సిబ్బంది ఆస్పత్రి పరిసరాలతో పాటు బర్డ్, రుయా ఆస్పత్రి పరిసరాల్లోనూ గాలింపు చర్యలు చేపట్టినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే అదృశ్యమైన రోగి వృద్ధుడు కావడం, నాల్గవ అంతస్తు నుంచి కిందకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో పాటు బయటకు వెళితే కనీసం ఆ దృశ్యాలు కూడా సీసీ కెమెరాల్లో రికార్డు కాకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తున్నట్లు స్విమ్స్ సిబ్బంది చెబుతున్నారు.

ఎమ్మార్పీఎస్ నేతల నిరసన : స్విమ్స్‌లో పేషెంట్ సీతారామప్ప కన్పించకుండా పోవడానికి ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఎమ్మార్పీఎస్, బీసీ విద్యార్థి సంఘం నేతలు గురువారం నిరసన వ్యక్తం చేశారు.బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవడంతోపాటు తప్పిపోయిన రోగిని త్వరితగతిన కుటుంబసభ్యులకు అప్పగించాలని డిమాండు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నేత పులికుంట్ల గోపి, బీసీ సంక్షేమ సంఘం నేత తురకా అమర్నాథ్, బీసీ విద్యార్థి సంఘం నేత రాజేష్ మాట్లాడుతూ టీటీడీ ఈవో స్పందించాలని కోరారు. దీంతో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటల లోపు సీతారామప్ప ఆచూకీ కనిపెట్టకపోతే ఆందోళనకార్యక్రమాలు ఉధ్రుతం చేస్తామని హెచ్చరించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న పలమనేరు బాలాజి, విజయలక్ష్మి

తెలుగు భాషా పురస్కారాల ప్రదానం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు)/పలమనేరు, ఆగస్టు29 : తెలుగు భాషా సాహిత్య రంగాల్లో చేసిన కృషికి గుర్తింపుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరు ప్రముఖులను రాష్ట్రప్రభుత్వం తెలుగు భాషా పురస్కారాలతో సత్కరించింది.విజయవాడలోని తుమ్మలపల్లె కళా క్షేత్రంలో గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఈ పురస్కారాలను అందుకున్నారు.వీరిలో తిరుపతిలోని మహిళా విశ్వవిద్యాలయం తెలుగు విశ్రాంతాచార్యులు మూలె విజయలక్ష్మి, చిత్తూరు జిల్లాకు చెందిన పలమనేరు బాలాజి వున్నారు.30 ఏళ్ళ తెలుగు భాషా సాహిత్య బోధనలో 28 పీహెచ్‌డీలు, 7ఎంఫిల్ డిగ్రీలకు ఆచార్య విజయలక్ష్మి పర్యవేక్షకురాలిగా వ్యవహరించారు.14 పుస్తకాలు,108 పరిశోధనా వ్యాసాలు రాశారు.పలమనేరుకు చెందిన బాలాజీ కవిత్వం, కథ, విమర్శ రంగాల్లో కృషి చేశారు.ఇప్పటిదాకా ఆయన రచనలు ఆరు పుస్తకాలుగా వెలువడ్డాయి.కొన్ని కథలు,కవితలు కన్నడ,తమిళ, అంగ్ల భాషల్లో అనువాదమయ్యాయి.

నారా లోకేష్‌ను కలిసిన టీడీపీ నేతలు



చంద్రగిరి, ఆగస్టు 29: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను చంద్రగిరి మండల టీడీపీ నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో.. చంద్రగిరి టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా తదితరులున్నారు.

సాంకేతిక పద్ధతులపై రైతులు దృష్టి పెట్టాలి

ఈ-పంట నోడల్ అధికారి విజయభారతి



వరి పొలంలో రైతుతో మాట్లాడుతున్న విజయభారతి

రావంచంద్రాపురం, ఆగస్టు 29: సాంకేతిక పద్ధతులపై రైతులు దృష్టి పెట్టాలని ఏపీ కమిషనరేట్ అగ్రికల్చర్ ఈ-పంట నోడల్ అధికారి విజయభారతి సూచించారు. మండలంలోని గంగిరెడ్డి రైతు భరోసా కేంద్రాన్ని శనివారం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ-క్రాప్ నమోదుపై రైతులకు పూర్తిగా అవగాహన వచ్చేవరకు పొలాల్లో పంటలు పరిశీలించి, సాగు నమోదు చేయాలని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సూచించారు. అనంతరం పీవీపురం పొలాల్లో వరిసాగును పరిశీలించి, రైతు మురళితో సాగు కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా సాంకేతిక వ్యవసాయశాఖ అధికారి హరిత, ఆర్‌సీపురం వ్యవసాయశాఖ అధికారి స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి



విద్యార్థులతో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అధ్యాపకులు

తిరుపతిరూరల్, ఆగస్టు 29: విద్యార్థులు చదువుతో సమానంగా క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి సూచించారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా క్రీడాభారతి సభ్యులతో విద్యార్థులు, అధ్యాపకులు కలసి గురువారం ర్యాలీ నిర్వహించారు. బ్యాడ్మింటన్ డబుల్స్, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అకడమిక్ డీన్ రజనీకాంత్ శుక్లా, చీఫ్ వార్డెన్ వెంకట్రావు, ర్యాగింగ్‌సెల్ నోడల్ ఆఫీసర్ జ్యోతి, ఏపీఆర్వో డాక్టర్ కనపాల కుమార్, ఎడ్యుకేషన్ ఏఆర్ సాంబశివరావు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి బెంచీల వితరణ



చంద్రగిరి, ఆగస్టు 29: చంద్రగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి విశాలక్ష్మి గురువారం బెంచీలను వితరణ చేశారు. రోగులు ఓపీ వేళల్లో కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో చంద్రగిరికి చెందిన విశాలక్ష్మి నాలుగు టేకు బెంచీలను సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకు అందజేశారు. డాక్టర్ కీర్తి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, జాతీయ నేత్రదానం దినోత్సవాన్ని అరుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలయ్య అభిమానుల అన్నదానం



చంద్రగిరి, ఆగస్టు 29: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభిమానులు గురువారం రేణిగుంటలో ఉన్న అభయ క్షేత్రంలో అన్నదానం చేశారు. సినీనటుడు బాలయ్య సినిమా పరిశ్రమకు వచ్చి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా అభిమానులు ఈ కార్యక్రమం నిర్వహించారు. బాలయ్య అభిమానులు మనోహర్‌రెడ్డి, గౌరవ్, కేపీ చౌదరి, లోకేష్ చౌదరి, మదన్‌మోహన్, భరత్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామాన్య భక్తులను పట్టించుకోండి: సీఐటీయూ



సమావేశంలో ప్రసంగిస్తున్న కందారపు మురళి

తిరుపతి, ఆగస్టు 29: టీటీడీలో వాటాలు గురించి కొట్లాటలు మానుకుని, సామాన్య భక్తుల గురించి పట్టించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అన్నారు. టీటీడీ పరిపాలనా భవనం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు చేపడుతున్న నిరసన దీక్ష 9వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర అధ్యక్షతన వివిధ ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ప్రసంగించారు. తిరుమలలో రాజకీయాలు వద్దు అంటూనే రాజకీయ నేతల చేతుల్లో నిర్ణయాలు బందీగా మారిపోయాయని ఆరోపించారు. శ్రీవారిమెట్టు మార్గంలో చిరు వ్యాపారుల పట్ల టీటీడీ వైఖరిని తీవ్రంగా ఖండించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, టీటీడీ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు సుబ్రమణ్యం, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత, తదితరులు చిరు వ్యాపారులకు మద్దతు పలికారు. చిరు వ్యాపారులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో దశాబ్దాల నాటి చెట్ల నరికివేత

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 29: ఎస్వీయూనివర్సిటీలో దశాబ్దాల నాటి చెట్లను నరికేస్తున్నారు. దీన్నిచూసి విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా చెట్ల నరికివేతకు అనుమతించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు చిన్నా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై రిజిస్ట్రార్ భూపతి నాయుడిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. యూనివర్సిటీలోని 258 చెట్ల నరికివేతకు 2023 డిసెంబరు 7వ తేదీ అప్పటి వీసీ ఉత్తర్వులకు అనుగుణంగా, అదే నెల 15వ తేదీ ఇంజనీర్ పేరుతో ఆదేశాలు వెలువడ్డాయన్నారు. అయితే, నవంబరు 23వ తేదీ నాటికే వీసీ రాజారెడ్డి పదవీ కాలం ముగిసిందన్నారు. డిసెంబరు 27వ తేదీ వీసీగా శ్రీకాంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారన్నారు. అటువంటిది డిసెంబరు ఏడో తేదీన అధికారిక ఉత్తర్వులు ఎలా వెలువడ్డాయని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు.

తిరుమల తరహాలో తిరుచానూరు అభివృద్ధి

టీటీడీ ఈవో శ్యామలరావు



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుచానూరు, ఆగస్టు 29: తిరుమల శ్రీవారి ఆలయం తరహాలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుచానూరులోని అమ్మవారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయంలో ప్రస్తుతం ఉన్న ఐనా మహల్, యాగశాల, పోటు, ప్రసాదాల పంపిణీ కౌంటరును పరిశీలించారు. ఎలక్ట్రికల్ కంట్రోల్ రూమ్‌ను ఆలయం బయటకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. అంతకుముందు ఆలయం వెలుపల ఉన్న వాహన మండపం, ఆస్థాన మండపం కిందున్న సెల్లార్, క్యూలైన్లు, పాత డిప్యూటీ ఈవో కార్యాలయం, ఆలయ నాలుగు మాడవీధులు, పద్మ సరోవరం పరిశీలించి పలు సూచనలిచ్చారు. జేఈవో వీరబ్రహ్మం, సీఈ నాగేశ్వరరావు, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్‌లో ప్లాంట్ ఫర్ మదర్

తిరుపతిరూరల్, ఆగస్టు 29: తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులతో కలసి గురువారం ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమం పేరిట మొక్కలను నాటారు. ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



వేటూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

వేటూరి ప్రభాకర శాస్త్రి కృషి అసామాన్యం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 29: తిరుమల శ్రీవారిపై అన్నమయ్య రచించిన సంకీర్తనలను అనువదించి, స్వామివారి వైభవాన్ని ప్రపంచానికి చాటిన వేటూరి ప్రభాకర శాస్త్రి కృషి అసామాన్యమని విశ్రాంత ఆచార్యుడు కె.సర్వోత్తమరావు అన్నారు. గురువారం ఉదయం అన్నమాచార్య కళామందిరంలో వేటూరి ప్రభాకర శాస్త్రి వర్ధంతి సభ జరిగింది. శ్రీప్రభాకర మిత్రమండలి తరఫున వేణుగోపాల్ మాట్లాడుతూ.. వేటూరి రచించిన నీతి-నిధి పుస్తకం అందరూ చదవదగ్గదని తెలిపారు. తెలుగు ఆచార్యులు కట్టమంచి మహాలక్ష్మి, టీటీడీ ప్రచురణల విభాగం ఉప సంపాదకుడు నరసింహాచార్యులు ప్రసంగించారు. అంతకుముందు ఉదయం శ్వేత భవనం ఎదుట ఉన్న ప్రభాకర శాస్త్రి విగ్రహానికి టీటీడీ అధికారులు పూలమాలవేసి నివాళి అర్పించారు. అన్నమాచార్య ప్రాజెక్టు అధికారి కుమార్, లోకనాథరెడ్డి, కోకిల పాల్గొన్నారు.

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): ఎస్వీయూ ఓఆర్ఐ విభాగంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, డాక్టర్ తొండాటి రాజశేఖర్, సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు. ఓఆర్ఐలో రీడరుగా వేటూరి పని చేశారని గుర్తు చేసుకున్నారు.

మాజీ ఉప రాష్ట్రపతికి స్వాగతం



రేణిగుంట, ఆగస్టు 29: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. కడప జిల్లా ఎర్రగుంట్లలో తెలుగు భాష దినోత్సవంలో హాజరయ్యేందుకు గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో ఇక్కడకు చేరుకున్న ఆయనకు బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి స్వాగతం పలికారు. కొంతసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం రోడ్డు మార్గాన రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకుని ముంబై ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని తిరిగి మధ్యాహ్నం 3గంటలకు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో రాత్రి 8 గంటలకు రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. రోడ్డు మార్గాన తిరుపతి బయలుదేరి అక్కడ బస చేసి ఉదయం హైదరాబాద్ తిరుగు ప్రయాణమవుతారు.

ఏమార్చి.. ఏటీఎం కార్డు మార్చేసి

● రూ.86 వేలు విత్‌డ్రా చేసేసిన నిందితుడు



ఏటీఎంలో నగదు డ్రా చేస్తున్న క్రమంలో కార్డు మార్చేసిన దుండగుడు (వృత్తంలోని వ్యక్తి)

కల్లూరు, ఆగస్టు 29: ఏటీఎంలో నగదు విత్‌డ్రా చేసే ప్రక్రియలో ఉన్న వ్యక్తిని ఏమార్చాడు. ఏటీఎం కార్డు మార్చేశాడు. రూ.86 వేల నగదు విత్‌డ్రా చేశాడు. పులిచెర్ల మండలం కల్లూరులో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాజారెడ్డి గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కల్లూరు పంచాయతీ కట్టకిందపల్లికి చెందిన గురుమూర్తినాయుడు ఈనెల 22వ తేది ఉదయం సుమారు 10 గంటల సమయంలో నగదు డ్రా చేసుకునేందుకు సదుం రోడ్డులోని కల్లూరు ఇండియన్ బ్యాంకు ఏటీఎం వద్దకు వచ్చారు. ఏటీఎం మిషన్‌లో కార్డు పెట్టి పిన్ నెంబరు కొట్టి మిగిలిన ప్రక్రియ జరుగుతున్న క్రమంలో వెనుకనే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి ఆయన్ను ఏమార్చి.. ఆ కార్డును మార్చేశాడు. దీన్ని గుర్తించని గురుమూర్తినాయుడు నగదు రాకపోవడంతో డ్రా చేసే ప్రక్రియను తిరిగి చేపట్టారు. అయినా నగదు రాకపోవడంతో మిషన్‌లోని ఏటీఎం కార్డును తీసుకొని వెళ్లిపోయారు. కానీ, నగదు డ్రా అయినట్లు మెసేజీలు రావడంతో ఆయన ఇండియన్ బ్యాంకుకు వెళ్లి విచారించారు. మీ ఖాతా నుంచి రూ.86 వేలు నగదు డ్రా అయినట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు. బ్యాంకు సిబ్బంది తెలిపిన సమాచారం మేరకు పీలేరు పెట్రోల్ బంకులో స్వైప్ మిషన్ ద్వారా నగదు డ్రా చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు గురుమూర్తినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

సూళ్ళూరుపేట-బుచ్చినాయుడు కండ్రిగ రహదారిపై

మట్టి పోసి మమ అనిపించారు

● వర్షమొస్తే రోడ్డుపై కష్టాలు మామూలే

● రెండులైన్ల విస్తరణ కోసం నిరీక్షణ



సాధనవారిపాళెం దగ్గర రోడ్డు ప్రక్కన తోలిన మట్టిని రోలింగ్ చేస్తున్న రోలర్ - గాజులపెళ్లూరు దగ్గర ఉన్న రోడ్డుకు మట్టి తోలకపోవడంతో ఇరుక్కున్న వాహనాలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 29: సూళ్ళూరుపేట-బుచ్చినాయుడు కండ్రిగ రహదారి గత ఐదేళ్లుగా అధ్వానంగా తయారైంది. గతంలో సింగిల్ రోడ్డుగా ఉన్నా వాహ న రాకపోకలు తక్కువగా ఉండేవి. పెద్దగా సమస్యలు ఎదురయ్యేవి కావు. ప్రస్తుతం సూళ్లూరుపేట, వరదయ్యపాళెం మండలాల్లో భారీ సంఖ్యలో పరిశ్రమలు ఆవిర్భవించాయి. అదే స్థాయిలో వాహనాల రద్దీ కూడా పెరిగింది. దీంతో ఈ సింగిల్ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈనేపథ్యంలో ఇటీవల శ్రీహరికోటలోని షార్‌ని సందర్శించేందుకు వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తమ రహదారి ఇబ్బందులను స్థానిక నాయకులు తీసుకువెళ్లారు. వెంటనే ఉప ముఖ్య మంత్రి స్పందించారు. రహదారి పనులు చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో రహదారికి ఇరువైపుల మట్టి పోశారు. రహదారి మధ్యలో గుంతలు పూడ్చారు. కొంతమేర ప్యాచ్ పనులూ చేపట్టారు. కానీ ప్రస్తుతం చేపడుతున్న పనులు తాత్కాలికమేనని వాహనదారులు చోదకులు పెదవి విరుస్తున్నారు. మోస్తరు వర్షం కురిసినా ఈ రహదారి గతంలో మాదిరిగా గుంతలుగా మారుతుందంటున్నారు. బీఎన్‌కండ్రిగ నుంచి గాజులపెళ్లూరు వరకు అసలు పనులే చేపట్టకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రెండు వరుసల(డబుల్) రహదారి నిర్మాణమొక్కటే శాశ్వత పరిష్కారమని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముగిసిన ఎకనమిక్స్ జాతీయ సదస్సు



శ్రీలంకకు చెందిన అమృతలింగంను సన్మానిస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 29: పద్మావతి మహిళా యూనివర్సిటీ సావేరి హాల్ వేదికగా రెండ్రోజులుగా నిర్వహించిన జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ఎస్వీయూ-పద్మావతి వర్సిటీలకు చెందిన ఎకనమిక్స్ విభాగాలు సంయుక్తంగా అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలు - సవాళ్లు - సమగ్రాభివృద్ధి అంశంపై ఈ సదస్సు నిర్వహించారు. ముగింపు సభలో శ్రీలంకకు చెందిన ప్రొఫెసర్ అమృతలింగం, ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మనాభం తదితరులు ప్రసంగించారు. సదస్సు కన్వీనర్లు డాక్టర్ మాధవి, డాక్టర్ సునీత, ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో పెన్షనర్ల కోసం ఆన్‌లైన్ పోర్టల్



పోర్టల్‌ను ఆవిష్కరించిన అప్పారావు, భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 29: ఎస్వీయూనివర్సిటీలోని టీచింగ్, నాన్ టీచింగ్ పెన్షనర్ల కోసం ఆన్‌లైన్ పోర్టల్‌ను రూపొందించారు. ఈ పోర్టల్‌ను ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు గురువారం ఆవిష్కరించారు. పెన్షనర్లంతా ఎస్వీయూనివర్సిటీ.ఎడ్యు.ఇన్ పోర్టల్‌ను చూడాలని అధికారులు తెలిపారు. రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

టీటీడీలో లడ్డూల రేషన్ విధానం రద్దు చేయాలి: సీపీఎం

తిరుమల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): 'టీటీడీలో లడ్డూల రేషన్ విధానం కారణంగా తీవ్రమైన అలజడి ఏర్పడే ప్రమాదం ముంది. భక్తుల మనోభావాలకు భిన్నంగా ఉన్న ఈనిర్ణయాన్ని రద్దు చేయాలి' అని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు గురువారం ఓ ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. తిరుమలకు వచ్చే భక్తులు తమ కుటుంబ సభ్యులతోపాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న తెలిసిన వారికి భక్తిభావంతో అందజేసే ప్రసాదంగా లడ్డును అందజేస్తారన్నారు. అలాంటిది రేషన్ ద్వారా దళారుల నియంత్రణకు తోడ్పడుతుందని టీటీడీ అదనపు ఈవో చెప్పడం అశాస్త్రీయమైందన్నారు. తక్షణం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని పేర్కొన్నారు.

తిరుమలలో పుష్కరిణి మరమ్మతు పనులు పూర్తి

ఎల్లుండి నుంచి భక్తులకు అనుమతి



మరమ్మతు పనులు పూర్తయ్యాక నింపిన నీటితో పుష్కరిణి

తిరుమల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పుష్కరిణిలో మరమ్మతు పనులు పూర్తయ్యాయి. సాధారణంగా ఏటా బ్రహ్మోత్సవాలకు ముందు పుష్కరిణిలోని నీటిని తొలగించి మరమ్మతుల అనంతరం తిరిగి నీటిని నింపడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 1 నుంచి 31 వ తేదీ వరకు పుష్కరిణిని మూసివేసి మరమ్మతులు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఈక్రమంలో పుష్కరిణిలోని నీటిని తొలగించి మరమ్మతు పనులు పూర్తిచేశాక తిరిగి నీటితో నింపారు.ప్రస్తుతం మెట్లపై చిన్నపాటి ఇంజనీరింగ్ పనులు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో పుష్కరిణిని సిద్ధం చేసి ఆదివారం నుంచి భక్తులను పుష్కరిణిలోకి అనుమతించనున్నారు. దీంతో నెలరోజుల పాటు వెలవెలబోయిన పుష్కరిణి తిరిగి భక్తులతో కళకళలాడనుంది.

మధురానగర్‌లో మందుబాబుల హల్‌చల్



మున్సిపల్ కాంప్లెక్సు వద్ద, రోడ్లపై ఖాళీ మందుబాటిళ్లు

తిరుపతి(మధురానగర్), ఆగస్టు 29: మధురానగర్‌లో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. ఇక్కడున్న మున్సిపల్ కాంప్లెక్సులో కొన్ని షాపులు ఖాళీగా ఉండటంతో వీటి ఆవరణలో మందుబాబులు కూర్చొని మద్యం తాగుతున్నారు. దీనివల్ల ఈ మార్గంలో రాత్రిపూట వెళ్లాలంటేనే మహిళలు, చిన్నారులు హడలిపోతున్నారు. ఇటీవల రోడ్డుపై నడిచి వస్తున్న ఇద్దరు మహిళలతోనూ మందుబాబులు అసభ్యకరంగా ప్రవర్తించారు. పోలీసుల గస్తీ ఇక్కడ లేకపోవడంతో వీరి ఆగడాలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.







ఎస్వీయూలో జరిగిన కార్యక్రమంలో అప్పారావు, భూపతినాయుడు తదితరులు - టీపీపీఎం పాఠశాలలో.. - శ్రీచైతన్య స్కూల్‌లో..

విద్యాసంస్థల్లో తెలుగు భాషా దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 29: తెలుగు భాష ఉన్నతి కోసం ఎస్వీ యూనివర్సిటీ ఎంతో కృషి చేసిందని ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. సాంస్కృతిక విభాగం సమన్వయకర్త డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో వారు ప్రసంగించారు. ప్రిన్సిపాళ్లు పద్మనాభం, సత్యనారాయణ, సాహిత్యవేత్తలు డాక్టర్ వీఆర్ రాసాని, మల్లేశ్వరరావు మాట్లాడారు. స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బీవీ మురళీధర్, పాల్గొన్నారు. ● తెలుగు విభాగంలో జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, అతిథి అధ్యాపకులు బ్రహ్మానంద రెడ్డి, అశోక్, ఆదిశేషయ్య, పెంచలప్రసాద్, పరిశోధకులు పాల్గొన్నారు. ● పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో కవి సమ్మేళనం ఆకట్టుకుంది. తెలుగు విభాగ అధ్యక్షురాలు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, అధ్యాపకులు డాక్టర్ వై.సుభాషిణి, డాక్టర్ డి. యువశ్రీ, డాక్టర్ బి. లక్ష్మీప్రియ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి(విద్య/రూరల్/కల్చరల్/జీవకోన): తిరుపతిలోని టీపీపీఎం పాఠశాలలో, శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాలలో, బీజేపీ ఆధ్వర్యంలో, జీఎస్ మాడవీధిలోని శ్రీచైతన్యస్కూల్‌లో, ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో, ఎస్వీ సంగీత నృత్య కళాశాలలో, జీవకోన సత్యనారాయణపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో, రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలోనూ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ● జాతీయ సంస్కృత వర్సిటీ తెలుగువిభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళా వర్సిటీ వీసీ ఉమ, తెలుగుసంస్కృత అకాడమీ మాజీ డైరెక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా పి.పొన్నారావు, వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, డాక్టర్ నల్లన్న, డాక్టర్ జి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ● విద్వస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శతావధాని ఆముదాల మురళి, అమృత భారతి అధ్యక్షుడు ఎల్.ప్రకాశరెడ్డి, మద్దూరి ఆదిత్య శర్మ, గోపీకృష్ణారెడ్డి ప్రసంగించారు. పాఠశాల అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షులు దొడ్డా ఉమామహేశ్వర్, హెచ్‌ఎం ఎ వాగ్దేవి ప్రసంగించారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ చిట్టిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రగిరి: బ్లూమింగ్ బడ్స్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ హితేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాకాల: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం మహ్మద్ రఫీ, ఎస్ఎంసీ చైర్మన్ పి.మునిప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో..



బ్లూమింగ్ బడ్స్‌లో..

స్మార్ట్‌సిటీ పనులు వేగవంతం చేయండి

● తిరుపతిలో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరం
● చైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, కమిషనర్

తిరుపతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తి చేయించాలని చైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో స్మార్ట్ సిటీ ఎండీ, నగరపాలక సంస్థ కమిషనర్ నారపరెడ్డి మౌర్య అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. 70 శాతం పూర్తయిన పనులకు నిధులు విడుదల చేసి, వెంటనే పూర్తయ్యేలా చూడాలన్నారు. పెండింగ్‌లోని నిధుల వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. తిరుపతిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నగరంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ భవనం నిర్మాణ పనులకు నిధులు విడుదల చేసి, త్వరగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. నిత్యం రద్దీగా ఉండే ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో యాత్రికులు, ప్రజల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలను త్వరగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో బోర్డు డైరెక్టర్లు తుడా ఇన్‌చార్జి వీసీ వెంకట నారాయణ, రామచంద్రా రెడ్డి, రమాశ్రీ, ఎస్ఈ మోహన్, జీఎం చంద్రమౌళి, ఎంఈ చంద్రశేఖర్, ఏఎస్పీ నాగభూషణ రావు, డీఎస్పీలు వెంకట నారాయణ, రామకృష్ణ ఆచారి, ఏఇకామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

ఎన్ని భాషలు నేర్చినా..అమ్మభాషలోనే ఆలోచనలు

● రచయిత్రి ఓల్గా


సాకం నాగరాజ దంపతులకు వేమన సాహితీ పురస్కార ప్రదానం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 29: మనిషి ఎన్ని భాషలు నేర్చినా, ఆలోచనలు మాత్రం అమ్మ భాషలోనే వస్తాయని ప్రముఖ రచయిత్రి ఓల్గా అన్నారు. స్థానిక యశోదనగర్ లోని వేమన విజ్ఞానకేంద్రంలో గిడుగు జయంతిని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన మాతృభాషా దినోత్సవంలో ఆమె ప్రసంగించారు. ఇందులో భాగంగా నగరానికి చెందిన సాహితీ ప్రముఖుడు సాకం నాగరాజను వేమన సాహితీ పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ ప్రాచ్యపరిశోధన సంస్థ సంచాలకుడు ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వేమన పేరుతో ఇస్తున్న మొదటి పురస్కారం అందుకోవడానికి సాకం తగిన వ్యక్తి అన్నారు. తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు టెంకాయల దామోదరం అధ్యక్షత వహించగా ఆత్మీయ అతిథులుగా జె.దుర్గాప్రసాద్, మట్టా పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు. వేమన విజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున సభాకార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. గాలి గుణశేఖర్, తోట వెంకటేశ్వర్లు, నెమిలేటి కిట్టన్న, వాకా ప్రసాద్, పేరూరు బాలసుబ్రమణ్యం, ఏనుగు అంకమనాయుడు, ఆర్‌సీకే రాజు, నడ్డి నారాయణ, పయ్యావుల గురునాథం, నాట్య గురువు సుభాషిణి, రామమూర్తి పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి


మాడవీధుల్లో ఎస్పీ, సీవీఎస్వో తనిఖీలు

తిరుమల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాల భద్రతాఏర్పాట్లపై సీవీఎస్వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడితో సమీక్షించారు. అక్టోబరు 4 నుంచి జరిగే బ్రహ్మోత్సవాల్లో టీటీడీ, పోలీసు, సంబంధిత విభాగాల అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ముందుగా సీవీఎస్వో నాలుగుమాడవీధుల్లోని గ్యాలరీలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ఎదురయ్యే సవాళ్లు, అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పార్కింగ్ స్థలాలు, రోప్ పార్టీలు, సంబంధిత సమస్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ అందించారు. అనంతరం ఎస్పీ భక్తులకు కల్పించనున్న భద్రతాచర్యలను వివరించారు. ఈ సమావేశంలో టీటీడీ విజిలెన్స్, జిల్లా పోలీసులు, అధికారులు పాల్గొన్నారు. కాగా, సమీక్ష అనంతరం ఎస్పీ, సీవీఎస్వో శ్రీవారి ఆలయ మాడవీధుల్లో తనిఖీలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ముగిసిన ఆటల పోటీలు


క్రీడాకారులతో అధికారులు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 29: నాలుగు రోజులుగా జరుగుతున్న జాతీయ క్రీడాదినోత్సవ ఆటల పోటీలు గురువారంతో ముగిశాయి. ప్రతిభ చూపిన క్రీడాకారులకు, జట్లకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. గతంలో జాతీయస్థాయిలో పతకాలు సాధించిన పదిమంది క్రీడాకారులను సన్మానించారు. డీఈవో శేఖర్, డీఎస్‌డీవో సయ్యద్ సాహెబ్, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు జయరామయ్య, బాబు, కోచ్‌లు శ్రీలక్ష్మీకరణ, గోపి, వినోద్, చక్రవర్తి, ప్రేమ్‌నాథ్, సాయిసుమతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైకుంఠ యాత్ర రథం



తిరుపతి అర్బన్, ఆగస్టు 29: మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైకుంఠ యాత్ర రథాన్ని గురువారం సాయంత్రం ఎంఆర్ పల్లె కూడలి సమీపంలో రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు ప్రారంభించారు. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు సి.వి.రమణ, సుకుమార్ మాట్లాడుతూ.. నగర పరిధిలో 10కిలోమీటర్ల వరకు ఈ రథాన్ని ఉచితంగా అందిస్తామని, ఆపైన ఇంధనం ఖర్చు చెల్లిస్తే చాలన్నారు. వివరాలకు 94414 49525, 62814 33397 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ప్రముఖ పారిశ్రామికవేత్త సైకం జయచంద్రారెడ్డి, తుడా ఈఈ ఎస్వీ కృష్ణారెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

టీటీడీకి విరాళంగా వాహనం



తిరుమల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి గురువారం ఉదయం టాటా సంస్థకు చెందిన ఓ రవాణా వాహనం విరాళంగా అందింది. రూ.10 లక్షల విలువైన టాటా యోధ 1700 బీఎస్‌వీఐ రవాణా వాహనాన్ని పలమనేరుకు చెందిన రవీంద్రారెడ్డి అందజేశారు. ఈమేరకు గురువారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తాళాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. కర్ణాటక ఎమ్మెల్యే గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు


లగడపాటి రాజగోపాల్

తిరుమల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్, టీడీపీ ఎమ్మెల్యే లలిత కుమారి, తమిళనాడు మంత్రి సీవీ గణేషన్, తెలంగాణ ఎమ్మెల్యేలు మాల్‌రెడ్డి రంగారెడ్డి, సత్యనారాయణ రావు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

పొన్నారావుకు సన్మానం



తిరుపతి(లీగల్), ఆగస్టు 29: కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా నియమితులైన ఏపీ హైకోర్టు న్యాయవాది పొన్నారావును గురువారం తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.గోపీచంద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తిరుపతి కోర్టుకు విచ్చేసిన ఆయన న్యాయవాదుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లావాసిగా ఇక్కడి సమస్యలను ఉన్నత న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మార్టిన్, మాజీ అధ్యక్షుడు లక్ష్మన్న, సామంచి శ్రీనివాస్, అజయ్‌కుమార్, గాలి మధు, గాజులక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన

తిరుపతి (జీవకోన), ఆగస్టు 29: నవభారత్ సేవా సమాజ్ సంస్థ ఆధ్వర్యంలో కట్టకిందవూరులో నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రం వద్ద గురువారం మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ గిరిజ, హెడ్‌కానిస్టేబుల్ శాంతి, కానిస్టేబుళ్లు ఎల్లమ్మ, లలిత, అంజమ్మ, శ్రావణి మాట్లాడారు. మహిళలకు ఇబ్బందులు ఎదురైన సమయంలో 8099999977, 100కు ఫోన్ చేయాలని సూచించారు. అగ్రిగేట్ నెట్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ చైర్‌పర్సన్ త్రివేణి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీ పాలిటెక్నిక్‌కు ల్యాబ్ పరికరాల వితరణ



తిరుపతి(విద్య), ఆగస్టు 29: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 1976-79 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఈసీఈ ల్యాబొరేటరీకి రూ.65వేల పరికరాలను వితరణ చేశారు. గురువారం ఈ పరికరాలను ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకానాథరెడ్డికి అందజేశారు. జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్, ఎలక్ట్రానిక్స్ హెడ్ రామారావు, ఈసీఈ అధ్యాపకుడు మహేంద్ర పాల్గొన్నారు.

వీటినిలా వదిలేస్తారా?

కరెంటు స్తంభాలపై గజిబిజిగా ఫైబర్ కేబుళ్లు


దొడ్డాపురం వీధిలో..


భవానీ నగర్‌లో..


టీకే స్ట్రీట్‌లో తెగిన కేబుళ్లు




వీవీ మహల్ రోడ్డులో..


గాలివీధిలో..

నగరంలోని ఏ కరెంటు స్తంభాన్ని చూసినా ఫైబర్ కేబుళ్లే కనిపిస్తున్నాయి. స్తంభం మొత్తాన్ని చుట్టేసి ఉన్నాయి. ఇవి అప్పుడప్పుడూ తెగి కిందపడి వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందిగా మారుతున్నాయి. ఇలా తెగిపడే కేబుళ్లతో కొన్నిసార్లు ప్రమాదాలు జరిగిన సందర్భాలూ లేకపోలేదు.
- తిరుపతి, ఆంధ్రజ్యోతి

క్రీడలపై ఆసక్తి పెంచుకోండి

విద్యార్థులకు కలెక్టర్ సూచన




ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పాల్గొన్న విద్యార్థులు, క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 29: విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఉదయం శ్రీనివాస క్రీడా సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించాక.. విద్యార్థులు, క్రీడాకారుల ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. కాంప్లెక్స్ నుంచి బాలాజీకాలనీ, మహతి కళాక్షేత్రం వరకు ర్యాలీ సాగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రీడలు, వ్యాయామానికి కనీసం అరగంట కేటాయించాలన్నారు. అనంతరం ప్రాంగణంలోని క్రికెట్, స్విమ్మింగ్, స్కేటింగ్, బ్యాడ్మింటన్ కోర్టులను పరిశీలించి క్రీడాకారులతో ముచ్చటించారు. ఇటీవల గోవాలో జరిగిన 73వ నేషనల్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన దండు పూజను అభినందించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, విద్యాశాఖాధికారి శేఖర్, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీణ్, ప్రొఫెసర్ శివకుమార్‌రెడ్డి, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, సీనియర్ సిటిజన్లు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

కొత్త ల్యాప్‌టాప్ ఇవ్వండి

● వినియోగదారుల ఫోరం తీర్పు

తిరుపతి(లీగల్), ఆగస్టు 29: తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన పీకే లక్ష్మీగణేష్‌కు కొత్త ల్యాప్‌టాప్‌తోపాటు రూ.50వేల నష్టపరిహారం, రూ.5వేలను కోర్టు ఖర్చులుగా చెల్లించాలని వినియోగదారుల ఫోరం గురువారం తీర్పు ఇచ్చింది. న్యాయవాది ఎ.సుమన్ తెలిపిన వివరాల మేరకు.. 2023 ఆగస్టు ఐదో తేదీన పీకే లక్ష్మీగణేష్ ఎంఆర్‌పల్లె ఎయిర్ బైపాస్‌రోడ్డులోని ఓ షోరూంలోని ల్యాప్‌టాప్ కొనుగోలు చేశారు. ఏడాది వారెంటీ ఉన్నప్పటికీ ల్యాప్‌టాప్ పనిచేయలేదు. దీంతో సర్వీస్ సెంటర్‌లో రిపేర్ చేసినా కూడా అదేపరిస్థితి ఉండటంతో బాధితుడు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. దీంతో పైవిధంగా తీర్పు వచ్చింది.

కుక్కల సుధాకర్‌ను వెలివేయాలి: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న సురేంద్రనాయుడు

తిరుపతి అర్బన్, ఆగస్టు 29: ముంబైకి చెందిన నటి కాదంబరి జెత్వానీని హింసించిన వైసీపీ నేత కుక్కల సుధాకర్‌ను సమాజం నుంచే వెలివేయాలని టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. జెత్వానీని ప్రేమపేరుతో లొంగదీసుకొని మోసం చేశారని ఆరోపించారు. అతడిని ఇకపై పిచ్చికుక్కల సుధాకర్ అని పిలవాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశాలతో ఇద్దరు ఐపీఎస్ అధికారులు జెత్వానీని, ఆమె తల్లిదండ్రులను ఆంధ్రాకు తీసుకొచ్చి హింసించడం దారుణమన్నారు. ఐదేళ్లలో వైసీపీ దురాగతాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయని ఆగ్రహించారు. వైసీపీ బాధిత కుటుంబాలు ధైర్యంగా మీడియా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు విశ్వనాథం, రాజారామ్, జనసేన నాయకుడు సాయి, ధనుంజయ్, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.82 కోట్లు

తిరుమల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.82 కోట్లు లభించింది. మంగళవారం ఉదయంనుంచి రాత్రి వరకు హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించింది. ఇక, బుధవారం 76,772 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,293 మంది తలనీలాలు సమర్పించారు.

ఎస్పీ కార్యాలయం వద్ద కలకలం

పిచ్చాటూరు చిరు వ్యాపారి ఆత్మహత్యాయత్నం


ఎస్పీ కార్యాలయానికి బిడ్డలతో వచ్చిన మునస్వామి దంపతులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 29: స్థల యజమాని వేధింపుల నుంచి కాపాడాలంటూ గురువారం తిరుపతిలోని ఎస్పీ కార్యాలయం వద్ద తన కుటుంబంతో కలసి ఒక చిరువ్యాపారి ఆత్మహత్యకు యత్నించాడు. అటు పోలీసులు.. ఇటు విద్యుత్ అధికారులు న్యాయం చేయలేదని ఆక్రోశంతో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకోబోయాడు. అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకుని ఎస్పీ సుబ్బరాయుడు ఎదుట హాజరుపరచారు. ఈ ఘటనపై తక్షణం విచారణ చేసి, నివేదిక సమర్పించాలని పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేష్‌ను ఎస్పీ ఆదేశించారు. ఆత్మహత్య చేసుకోవడం నేరమని, మరోసారి ఇలా ప్రవర్తించవద్దని చెప్పి పంపారు. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం తిరుత్తణికి చెందిన మునస్వామి, పిచ్చాటూరు మండలం అప్పంబట్టుకు చెందిన జ్యోతికి ఇద్దరు కుమారులు. మునస్వామి బతుకు తెరువు కోసం పిచ్చాటూరుకు వచ్చి స్థిరపడ్డాడు. నింద్ర, పిచ్చాటూరుకు మధ్య హైవేపై నింద్రకు చెందిన చాంద్‌బాషా భూమిని బాడుగకు తీసుకుని ఓ గది నిర్మించి, అందులో కూల్‌డ్రింక్, జ్యూస్ షాపు ఏర్పాటు చేసుకున్నాడు. కొద్ది నెలలుగా బాడుగ చెల్లించలేదు. మరోవైపు చాంద్‌బాషాకు అప్పులు ఎక్కువై బాడుగకు ఇచ్చిన స్థలాన్ని అమ్మేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఆ స్థలాన్ని తీసుకుంటావా అని మునస్వామినే అడిగాడు. తనకంత శక్తి లేదని చెప్పడంతో రెండు నెలల ముందు పిచ్చాటూరుకు చెందిన వృద్ధాశ్రమం నడిపే త్యాగరాజులుకు స్థలం విక్రయించాడు. ఆ తర్వాత తాను కొన్న స్థలంలో షాపును తొలగించాలని మునస్వామిని త్యాగరాజులు కోరాడు. దీనికోసం ఈనెల 15వ తేదీవరకు గడువిచ్చాడు. అయితే షాపును తొలగించకుండా మొండికేశాడు. మరోవైపు మూడు, నాలుగు నెలలు విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో కనెక్షన్‌ను ఆశాఖ అధికారులు కట్ చేశారు. షాపులో కొంత భాగాన్ని ఇటీవల త్యాగరాజులు కూడా కూల్చేశాడు. ఈ విషయంలో మునస్వామికి పిచ్చాటూరు పోలీసులు ఎన్నిసార్లు చెప్పినా వినలేదు. ఈ నేపథ్యంలో మునస్వామి తన భార్య, ఇద్దరు బిడ్డలతో కలిసి ఎస్పీ కార్యాలయం వద్దకొచ్చి హల్‌చల్ చేశాడు.

భూకబ్జాదారులపై కేసులు నమోదు చేయండి : సీపీఎం


చెరువును పరిశీలిస్తున్న నాయకులు

తిరుపతి (జీవకోన), ఆగస్టు 29: వినాయక సాగర్ సమీపంలో ఆక్రమణకు గురైన పాన్ చెరువును గురువారం సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. తిమ్మినాయుడుపాళెం సర్వే నెంబరు 84లో ఉన్న చెరువును ఆక్రమిస్తుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. నగర కార్యదర్శి వర్గ సభ్యులు వేణుగోపాల్, మాధవ్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాతృభాష దినోత్సవం


గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 29: తెలుగుభాషా పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని పలు పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎల్ఎసాగరం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గిడుగు వెంకటరామమూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు అన్నామణి తెలుగుభాష ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా క్రీడా దినోత్సవాన్ని కూడా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, గురునాథం, కిరణ్, సూర్యారావు, వెంకటరావు, సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయుడుపేట: దేశభాషలందు తెలుగులెస్స అని తేనెలూరే తెలుగు భాష ఎంతో కమ్మనైనదని బాలుర గురుకులం ప్రిన్సిపాల్ డాక్టర్ దాదాపీర్ అన్నారు. నాయుడుపేట ఎల్ఎసాగరంలోని గురుకులంలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులతోపాటు ఘన నివాళులర్పించారు. మల్లికార్జున్‌రావు, మోహన్‌రావు, రాజశేఖర్, వెంకటకృష్ణయ్య, బందిల శేఖర్, రమణయ్య తదితరులు ఉన్నారు.

వెంకటగిరిటౌన్: పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానో


గిడుగు రామమూర్తికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

పాధ్యాయురాలు లత, జడ్పీఉన్నత పాఠశాల వాణి, ఏపీ మోడల్ స్కూల్‌లో తులసీజ్యోతి, భావ్యం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఆయన జీవిత చరిత్రపై క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు, పద్య పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

గూడూరు: తెలుగుభాష వ్యాప్తికి గిడుగు వెంకటరామమూర్తి ఎనలేని కృషిచేశారని మినర్వా పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ అన్నారు. స్థానిక మినర్వాపాఠశాలలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించి విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రమణ, ఉషా, డాక్టర్ తనూజ, జీవని, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రఫూఫ్, హెచ్ఎం సుధాకర్, ప్రజేంద్రరెడ్డి, మాధవయ్య, ఆదిలక్ష్మి, షకీలా, వేణుగోపాల్‌రెడ్డి, కామేశ్వరి, చంద్రశేఖర్, కుమార్, ఏలియా తదితరులు పాల్గొన్నారు. చింతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగుభాష, జాతీయక్రీడా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శివసుబ్రమణ్యం, కోదండ రామారావు, అమ్మణ్ణి, మెహర్తాజ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


చింతవరంలో కవుల వేషధారణలో విద్యార్థులు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మువ్వా వృషాద్రిపతి పాల్గొని తెలుగు కవిత్వం, తెలుగు గొప్పతనాన్ని వివరించారు. అధ్యాపకులు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కోట: కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర, విద్యానగర్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకులాల్లో ప్రిన్సిపాల్‌లు కొరాడా నారాయణరావు, అంజనమ్మ, ఉపాధ్యాయులు గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిట్టమూరు: మండల పరిధిలోని కొత్తగుంట టీఎంఆర్ పాఠశాలలో తెలుగు భాష కోసం కృష చేసిన కవులు, శ్రీకృష్ణదేవరాయలు తదితర పండితుల వేషధారణలో చిన్నారులు అలరించారు. తెలుగుభాష గొప్పతనంపై పాటలు, నృత్యకార్యక్రమాలు చేపట్టారు. టీఎంఆర్ విద్యా సంస్థల అధినేత టీఎం మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రహంతుల్లా, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి


ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హాకీ క్రీడాకారులు

గూడూరు, ఆగస్టు 29: ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకుని నేటితరం క్రీడాకారులు ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని హాకీ కోచ్ దీపక్‌ఆకాష్ అన్నారు. గురువారం స్థానిక ఏఆర్‌రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం వద్ద హాకీ క్రీడాకారులు నివాళులర్పించారు. హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక రోటరీభవన్‌లో పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్‌పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. డాక్టర్ జనార్థన్‌రెడ్డి, మునిగిరీష్, దశరథరామిరెడ్డి, క్రిష్ణయ్య, జీజీనాయుడు, మయూరి శ్యామ్‌యాదవ్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ బదిలీ

సూళ్లూరుపేట, ఆగస్టు 29: సూళ్లూరుపేట మున్సిపాలిటీ కమిషనర్ చెల్లు గంగాప్రసాద్‌ను ఆత్మకూరు మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా రాయచోటి కమిషనర్‌గా ఉన్న ఈయన సూళ్లూరుపేటకు వచ్చి అప్పటి నుంచి కొనసాగుతున్నారు. ప్రస్తుతం సాధారణ బదిలీల్లో భాగంగా ఈయనను బదిలీ చేశారు. శుక్రవారం రిలీవ్‌కానున్నారు. మరో రెండురోజుల్లో సూళ్లూరుపేట మున్సిపాలిటీకి కొత్త కమిషనర్‌ను నియమించనున్నట్లు సమాచారం.

తిరుమలలో పుష్కరిణి మరమ్మతు పనులు పూర్తి

- ఎల్లుండి నుంచి భక్తులకు అనుమతి


మరమ్మతు పనులు పూర్తయ్యాక నింపిన నీటితో పుష్కరిణి

తిరుమల, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పుష్కరిణిలో మరమ్మతు పనులు పూర్తయ్యాయి. సాధారణంగా ఏటా బ్రహ్మోత్సవాలకు ముందు పుష్కరిణిలోని నీటిని తొలగించి మరమ్మతుల అనంతరం తిరిగి నీటిని నింపడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 1 నుంచి 31 వ తేదీ వరకు పుష్కరిణిని మూసివేసి మరమ్మతులు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఈక్రమంలో పుష్కరిణిలోని నీటిని తొలగించి మరమ్మతు పనులు పూర్తిచేశాక తిరిగి నీటితో నింపారు.ప్రస్తుతం మెట్లపై చిన్నపాటి ఇంజనీరింగ్ పనులు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో పుష్కరిణిని సిద్ధం చేసి ఆదివారం నుంచి భక్తులను పుష్కరిణిలోకి అనుమతించనున్నారు. దీంతో నెలరోజుల పాటు వెలవెలబోయిన పుష్కరిణి తిరిగి భక్తులతో కళకళలాడనుంది.

జలజీవన్ పనులకు ప్రాధాన్యత ఇవ్వండి

- పూర్తయిన వాటికి బిల్లులు సిద్ధం చేయండి
- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చైర్‌పర్సన్ ఆదేశం


జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ అరుణమ్మ, ఎమ్మెల్యే విజయశ్రీ, అధికారులు

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 29: జిల్లాలో ప్రతి ఇంటికి తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఇంజనీరింగ్ శాఖలపై సమగ్రంగా చర్చించారు. గత ప్రభుత్వంలో చేపట్టిన సచివాలయాలు, ఆర్బీకేలు, వివిధ భవనాలు, ఇతర పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్ ఉన్నాయని, నాలుగేళ్లగా మొత్తుకుంటున్నా పూర్తయిన పనులకు బిల్లులు రాలేదని, ఇప్పటికైనా వాటిని మంజూరు చేయించాలని జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, మాల్యాద్రి, వెంకట్రావు, రాఘవులు తదితర సభ్యులు విన్నవించారు. అలాగే రోడ్ల పనులు మంజూరైనా ఇంతవరకు టెండర్లు పిలవలేదని, ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయని వాపోయారు. జలజీవన్ పనులు సక్రమంగా జరగలేదని, స్థానిక ఎంపీడీవోలు పనుల పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వలేదని మండిపడ్డారు. దీంతో జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో కన్నమ నాయుడు మాట్లాడుతూ పనులు పూర్తయిన వాటికి ఎంబుక్‌ల రికార్డులను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేయాలన్నారు. పార్టీల కతీతంగా బిల్లులకు సంబంధించి రికార్డులను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. ప్రస్తుతం జలజీవన్ పనులపై సర్వే జరుగుతున్నందున ప్రజాప్రతినిధులంతా మండలస్థాయిలో సమీక్షించి, ఆ పనుల్లో లోటుపాట్లను సరిదిద్దేందుకు సహకరించాలని కోరారు.

- తాగునీటి పథకాలకు సౌరవిద్యుత్తు

జిల్లాలో పంచాయతీలకు విద్యుత్ బిల్లుల భారం నుంచి విముక్తి కలిగించేందుకు సౌరవిద్యుత్తు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించినట్లు సీఈవో కన్నమ నాయుడు జడ్పీటీసీలు, అధికారులకు తెలిపారు. తొలిగా మంచినీటి పథకాలకు అవసరమైన సౌర విద్యుత్తును వినియోగించుకునేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయించుకోవాలన్నారు. దీంతో బిల్లుల భారం పూర్తిగా తగ్గిపోతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంటే వాటి మంజూరుకు నివేదికలను కలెక్టర్‌కు పంపడం జరుగుతుందన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు.

మట్టి పోసి మమ అనిపించారు

- వర్షమొస్తే రోడ్డుపై కష్టాలు మామూలే
- రెండులైన్ల విస్తరణ కోసం నిరీక్షణ



సాధనవారిపాళెం దగ్గర రోడ్డు పక్కన తోలిన మట్టిని రోలింగ్ చేస్తున్న రోలర్ - గాజులపెళ్లూరు దగ్గర ఉన్న రోడ్డుకు మట్టి తోలకపోవడంతో ఇరుక్కున్న వాహనాలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 29: సూళ్ళూరుపేట-బుచ్చినాయుడు కండ్రిగ రహదారి గత ఐదేళ్లగా అధ్వానంగా తయారైంది. గతంలో సింగిల్ రోడ్డుగా ఉన్నా వాహన రాకపోకలు తక్కువగా ఉండేవి. పెద్దగా సమస్యలు ఎదురయ్యేవి కావు. ప్రస్తుతం సూళ్లూరుపేట, వరదయ్యపాళెం మండలాల్లో భారీ సంఖ్యలో పరిశ్రమలు ఆవిర్భవించాయి. అదే స్థాయిలో వాహనాల రద్దీ కూడా పెరిగింది. దీంతో ఈ సింగిల్ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈనేపథ్యంలో ఇటీవల శ్రీహరికోటలోని షార్‌ని సందర్శించేందుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తమ రహదారి ఇబ్బందులను స్థానిక నాయకులు తీసుకువెళ్లారు. వెంటనే ఉప ముఖ్యమంత్రి స్పందించారు. రహదారి పనులు చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో రహదారికి ఇరువైపుల మట్టి పోశారు. రహదారి మధ్యలో గుంతలు పూడ్చారు. కొంతమేర ప్యాచ్ పనులూ చేపట్టారు. కానీ ప్రస్తుతం చేపడుతున్న పనులు తాత్కాలికమేనని వాహనదారులు చోదకులు పెదవి విరుస్తున్నారు. మోస్తరు వర్షం కురిసినా ఈ రహదారి గతంలో మాదిరిగా గుంతలుగా మారుతుందంటున్నారు. బీఎన్‌కండ్రిగ నుంచి గాజులపెళ్లూరు వరకు అసలు పనులే చేపట్టకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రెండు వరుసల(డబుల్) రహదారి నిర్మాణమొక్కటే శాశ్వత పరిష్కారమని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అజాత శత్రువు వెంకటరెడ్డి

- ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కురుగొండ్ల


మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

డక్కిలి, ఆగస్టు 29: టీడీపీ సీనియర్ నేత, డక్కిలి మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి అజాత శత్రువని, అలాంటి వ్యక్తి దూరం కావడం బాధాకరమని సర్వేపల్లి, వెంకటగిరి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మండలంలోని మాటుమడుగు గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కడదాకా పార్టీలో కొనసాగిన వెంకటరెడ్డి మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని అన్నారు. వెంకటరెడ్డి సర్పంచ్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా, ఎంపీపీగా, 25 ఏళ్ల పాటు టీడీపీకి శాశ్వత అధ్యక్షుడిగా పనిచేశారని చెప్పారు. పోలంరెడ్డికి నివాళులు అర్పించిన వారిలో నియోజకవర్గ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, వేనాటి సతీష్ రెడ్డి, నెల్లూరు డీపీవో సుస్మిత రెడ్డి, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, టీడీపీ నాయకులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పప్పు చంద్రమౌళి రెడ్డి, రావి సత్యం, రావి మస్తాన్ నాయుడు, అవ్వారు సత్యనారాయణ, రంగినేని రాజా, వేముల నాగభూషణం నాయుడు, డక్కిలి చంద్రారెడ్డి, గడ్డం చంద్రశేఖరరెడ్డి, బైవర్ బ్రదర్స్, పులి జనార్దనరెడ్డి, చెన్ను తిరుపాల్ రెడ్డి, వేపమాను యువరాజ్, రాములు, వెంకటపతి, డి.వడ్డిపల్లి సర్పంచ్ చెంచమ్మ ఉన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణం ఆలస్యంపై నేడు ధర్నా

తడ, ఆగస్టు 29: పెరియవట్టు రైల్వేగేట్ నిర్మాణం ఆలస్యం కావడంతో గ్రామస్తులు శుక్రవారం ధర్నాకు పిలుపునిచ్చారు. పెరియవట్టు రైల్వేగేట్ నెంబరు 43 వద్ద బాక్స్‌టైపు బ్రిడ్జి నిర్మాణానికి గత ఏడాది ఫిబ్రవరిలో రైల్వే అధికారులు అనుమతులు ఇచ్చారు. కాంట్రాక్ట్ పొందిన గుత్తేదారుడు అదే ఏడాది మార్చిలో పనులను మొదలుపెట్టాడు. అప్పటి నుంచి రైల్వేగేట్ మూతపడి గ్రామస్తుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏడాదిన్నర గడిచినా పనులు పూర్తికాకపోవడంతో గ్రామస్తులు ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా కలెక్టర్ సైతం కల్పించుకొని చెన్నై సదరన్ రైల్వే అధికారులతో మాట్లాడినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం ధర్నా చేయాలని గ్రామస్తులు నిర్ణయించారు. ఆమేరకు గురువారమే అధికారులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా రైళ్లు నిలిచిపోయినా తమకు సంబంధం లేదంటూ అధికారులకు తెలిపారు. స్పందించిన అధికారులు రైల్వే అధికారులతో సంప్రదింపులు జరిపారు. మరోపక్క సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడులు గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. ధర్నాకు దిగవద్దని, రైల్వే ట్రాక్‌పై ధర్నాకు దిగితే చట్టరీత్యానేరమని, తద్వారా కేసులు ఎదుర్కోవాల్సివస్తుందని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. శుక్రవారం నుంచి పనులు మొదలుకాకుంటే తాము ధర్నాకు దిగేది ఖాయమని, ఎన్ని కేసులు పెట్టినా వెనక్కుతగ్గేదిలేదంటూ గ్రామస్తులు తేల్చిచెప్పారు. మరి శుక్రవారం పనులు మొదలవుతాయో లేక గ్రామస్తులు ధర్నాకు దిగుతారో చూడాల్సి ఉంది.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన సునీత సేవాసంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, ఆగస్టు 29: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఉచిత వృత్తివిద్యా కోర్సులను తమ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని సునీత సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మీ అన్నారు. స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో మహిళలకు మూడు నెలల పాటు నిర్వహించిన కుట్టు శిక్షణా తరగతులు ముగియడంతో గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జ్యోతి, పద్మావతి, లక్ష్మీనారాయణ, ఎంవీరమణయ్య, సారంగం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం

గూడూరు, ఆగస్టు 29: స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం అన్నారు. గురువారం స్థానిక కోర్టుఆవరణలో వివిధశాఖల అధికారులతో సమావేశంనిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాజీ అయ్యే కేసులకు సంబంధించిన కక్షిదారులు లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయమూర్తి సులోచనారాణి, డీఎస్పీ రమణకుమార్, సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, శ్రీనివాస్, అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గురుకులాల్లో తహసీల్దారు తనిఖీలు

కోట, ఆగస్టు 29: కోటలోని పలు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలను గురువారం తహసీల్దారు కటారి జయజయరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గురుకులాలను తహసీల్దారు పరిశీలించి ప్రిన్సిపాల్, వార్డెన్‌లకు పలు హెచ్చరికలు చేశారు. ముందుగా కోటలోని బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులం, యానాదుల బాలికల గురుకులం, బీసీ బాలుర గురుకులాలతోపాటు కోటలోని షెడ్యూల్ కులాల బాలికల వసతిగృహాలను పరిశీలించారు. విద్యార్థులు తింటున్న భోజనం, కూరలను, తాగునీరు పరిశీలించారు. గురుకులం నుంచి విద్యార్థులను బయటకుపంపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఒక ప్రిన్సిపాల్‌ను హెచ్చరించారు.

ఎస్పీ కార్యాలయం వద్ద కలకలం

- పిచ్చాటూరు చిరు వ్యాపారి ఆత్మహత్యాయత్నం


ఎస్పీ కార్యాలయం వద్ద ఇద్దరు బిడ్డలతో వచ్చిన మునస్వామి దంపతులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 29: స్థల యజమాని వేధింపుల నుంచి కాపాడాలంటూ గురువారం తిరుపతిలోని ఎస్పీ కార్యాలయం వద్ద తన కుటుంబంతో కలసి ఒక చిరువ్యాపారి ఆత్మహత్యకు యత్నించాడు. అటు పోలీసులు.. ఇటు విద్యుత్ అధికారులు న్యాయం చేయలేదని ఆక్రోశంతో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకోబోయాడు. అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకుని ఎస్పీ సుబ్బరాయుడు ఎదుట హాజరుపరచారు. ఈ ఘటనపై తక్షణం విచారణ చేసి, నివేదిక సమర్పించాలని పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేష్‌ను ఎస్పీ ఆదేశించారు. ఆత్మహత్య చేసుకోవడం నేరమని, మరోసారి ఇలా ప్రవర్తిస్తే మంచిది కాదని చెప్పి పంపారు. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం తిరుత్తణికి చెందిన మునస్వామి పిచ్చాటూరు మండలం అప్పంబట్టుకు చెందిన జ్యోతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు. బతుకు తెరువు కోసం పిచ్చాటూరుకు వచ్చి స్థిరపడ్డాడు. నింద్ర, పిచ్చాటూరుకు మధ్య హైవేపై నింద్రకు చెందిన చాంద్‌బాషా భూమిని బాడుగకు తీసుకుని ఓ గది నిర్మించి, అందులో కూల్‌డ్రింక్, జ్యూస్ షాపు ఏర్పాటు చేసుకున్నాడు. కొద్ది నెలలుగా బాడుగ చెల్లించలేదు. మరోవైపు చాంద్‌బాషాకు అప్పులు ఎక్కువై బాడుగకు ఇచ్చిన స్థలాన్ని అమ్మేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఆ స్థలాన్ని తీసుకుంటావా అని మునస్వామినే అడిగాడు. తనకంత శక్తి లేదని చెప్పడంతో రెండు నెలల ముందు పిచ్చాటూరుకు చెందిన వృద్ధాశ్రమం నడిపే త్యాగరాజులుకు స్థలం విక్రయించాడు. ఆ తర్వాత తాను కొన్న స్థలంలో షాపును తొలగించాలని మునస్వామిని త్యాగరాజులు కోరాడు. దీనికోసం ఈనెల 15వ తేదీవరకు గడువిచ్చాడు. అయితే షాపును తొలగించకుండా మొండికేశాడు. మరోవైపు మూడు, నాలుగు నెలలు విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో కనెక్షన్ ఆశాఖ అధికారులు కట్ చేశారు. షాపులో కొంత భాగాన్ని ఇటీవల త్యాగరాజులు కూడా కూల్చేశాడు. ఈ విషయంలో పిచ్చాటూరు పోలీసులు మునస్వామికి ఎన్నిసార్లు చెప్పినా వినలేదు. ఈ నేపథ్యంలో మునస్వామి తన భార్య, ఇద్దరు బిడ్డలతో కలిసి ఎస్పీ కార్యాలయం వద్దకొచ్చి హల్‌చల్ చేశాడు.

స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- తిరుపతిలో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరం
- చైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, కమిషనర్

తిరుపతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తి చేయించాలని చైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో స్మార్ట్ సిటీ ఎండీ, నగరపాలక సంస్థ కమిషనర్ నారపరెడ్డి మౌర్య అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. 70 శాతం పూర్తయిన పనులకు నిధులు విడుదల చేసి, వెంటనే పూర్తయ్యేలా చూడాలన్నారు. పెండింగ్‌లోని నిధుల వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. తిరుపతిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నగరంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ భవనం నిర్మాణ పనులకు నిధులు విడుదల చేసి, త్వరగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. నిత్యం రద్దీగా ఉండే ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో యాత్రికులు, ప్రజల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలను త్వరగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో బోర్డు డైరెక్టర్లు తుడా ఇన్‌చార్జి వీసీ వెంకట నారాయణ, రామచంద్రారెడ్డి, రమాశ్రీ, ఎస్ఈ మోహన్, జీఎం చంద్రమౌళి, ఎంఈ చంద్రశేఖర్, ఏఎస్పీ నాగభూషణ రావు, డీఎస్పీలు వెంకట నారాయణ, రామకృష్ణ ఆచారి, ఏఐకామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

పుష్కరిణి అభివృద్ధికి సహకారమందిస్తా

- టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ


చదలవాడను సత్కరిస్తున్న ఆలయ అధికారులు, పక్కనే సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి

సూళ్లూరుపేట, ఆగస్టు 29: సూళ్లూరుపేట మున్సిపాలిటీ మన్నారుపోలూరులోని సత్య జాంబవతి సమేత అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయానికి సంబంధించిన పుష్కరిణిని అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకరిస్తానని టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి అన్నారు. గురువారం ఆయన మన్నారుపోలూరు ఆలయాన్ని సందర్శించారు. గతంలో ఆయన హయాంలో ఈ ఆలయాన్ని టీటీడీలో విలీనం చేశారు. ఆలయ అభివృద్ధికి టీటీడీ రూ.5 కోట్లు మంజూరు చేయడంతో రెండేళ్లుగా జీర్ణోద్ధరణ పనులు జరిగాయి. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు కుంభాభిషేక వేడుకలు టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో గురువారం చదలవాడ ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకొన్నారు. ఆయనతో పాటు శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి ఉన్నారు. ముందుగా వారికి అధికారులు, గ్రామస్తులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలనంతరం సన్మానించారు. గ్రామస్తులు మునస్వామి, బాబురెడ్డి పాల్గొన్నారు.

డక్కిలి ఎస్ఐగా శివశంకర్



డక్కిలి, ఆగస్టు 29: మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం గట్టి చర్యలు తీసుకుంటామని డక్కిలి ఎస్ఐ శివశంకర్ అన్నారు. గురువారం ఆయన డక్కిలి ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

ఓజిలి ఎస్ఐగా స్వప్న



ఓజిలి, ఆగస్టు 29: ఓజిలి ఎస్ఐగా స్వప్న గురువారం బాధ్యతలు చేట్టారు. ఎస్పీ సుబ్బరాయుడు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన రవిబాబును తిరుపతి వీఆర్‌కు బదిలీ చేయగా, వీఆర్‌లో ఉన్న స్వప్నను ఓజిలి ఎస్ఐగా నియమించారు.

దొరవారిసత్రం ఎస్ఐగా అజయ్‌కుమార్



దొరవారిసత్రం, ఆగస్టు 29: దొరవారిసత్రం ఎస్ఐగా జి.అజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఎస్పీ సుబ్బరాయుడు దొరవారిసత్రంలో పనిచేస్తున్న ఎస్ఐ తిరుమలరావును వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న అజయ్‌కుమార్ బదిలీపై ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

ఉపాధ్యాయులకు బహుమతుల ప్రదానం


బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 29: ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ప్రగతి సేవాసంస్థ ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన జట్టుకు గురువారం స్థానిక ఏఆర్‌రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో బహుమతులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ఒత్తిడిలో ఉండే ఉపాధ్యాయులకు ఆటవిడుపుగా క్రికెట్ పోటీలను నిర్వహించడం ఆనందదాయకమన్నారు. విజేతగా నిలిచిన బాలాయపల్లి మండలం జట్టుకు, రన్నర్స్‌గా నిలిచిన వాకాడు మండలం జట్టుకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, ధనుంజయరెడ్డి, కరిముల్లా, శ్రీనివాసులు, సురేష్‌రెడ్డి, టీఆర్‌మణి, విజయ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని భాషలు నేర్చినా..

అమ్మభాషలోనే ఆలోచనలు

- రచయిత్రి ఓల్గా


సాకం నాగరాజ దంపతులకు వేమనసాహితీ పురస్కార ప్రదానం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 29: మనిషి ఎన్ని భాషలు నేర్చినా, ఆలోచనలు మాత్రం అమ్మ భాషలోనే వస్తాయని ప్రముఖ రచయిత్రి ఓల్గా అన్నారు. స్థానిక యశోదనగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో గిడుగు జయంతిని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన మాతృభాషా దినోత్సవంలో ఆమె ప్రసంగించారు. ఇందులో భాగంగా నగరానికి చెందిన సాహితీ ప్రముఖుడు సాకం నాగరాజును వేమన సాహితీ పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ ప్రాచ్యపరిశోధన సంస్థ సంచాలకుడు ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వేమన పేరుతో ఇస్తున్న మొదటి పురస్కారం అందుకోవడానికి సాకం తగిన వ్యక్తి అన్నారు. మాతృభాషలో చదువుకోవడం బాలల హక్కుగా భావించి.. అమలు చేసినపుడు తెలుగు భాష వర్ధిల్లుతుందన్నారు. తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు టెంకాయల దామోదరం అధ్యక్షత వహించగా ఆత్మీయ అతిథులుగా జె.దుర్గాప్రసాద్, మట్టా పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు. వేమన విజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున సభాకార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. గాలి గుణశేఖర్, తోట వెంకటేశ్వర్లు, నెమిలేటి కిట్టన్న, వాకా ప్రసాద్, పేరూరు బాలసుబ్రమణ్యం, ఏనుగు అంకమనాయుడు, ఆర్‌సీకే రాజు, నడ్డి నారాయణ, పయ్యావుల గురునాథం, నాట్య గురువు సుభాషిణి, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 29: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. స్వామివారికి వైభవంగా అభిషేకం నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. హారతులు ఇచ్చారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ఉద్యోగ మేళాలో 11మంది ఎంపిక



శ్రీకాళహస్తి, ఆగస్టు 29: పట్టణంలోని శ్రీస్వామి విద్యాప్రకాశనంద ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం జేకేసీ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించారు. అపోలో ఫార్మసీ, యంగ్ ఇండియా సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలకు 21మంది అభ్యర్థులు హాజరు కాగా 11మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.శ్రీలత మాట్లాడుతూ ఎంపికైన వారికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు జీతంతో పాటు ఇతర అలవెన్సులు వస్తాయన్నారు. నియామక పత్రాలను అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ, జేకేసీ కోఆర్డినేటర్ సతీష్, ఎఫ్‌టీఎం గిరిజమ్మ, కంపెనీ హెచ్‌ఆర్‌లు జగదీష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి, ఆగస్టు 29: తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో ఇటీవల నిర్వహించిన అథ్లెటిక్స్ సౌత్‌జోన్ అండర్-14 పోటీల్లో కాసాగార్డెన్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. 8వ తరగతి చదువుతున్న వాసంతి హైజంప్‌లో మొదటి స్థానం, జి.లాలిత్య, సి.సుకన్య రన్నింగ్‌లో ద్వితీయస్థానం సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. గురువారం పాఠశాలలో వారిని అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని ప్రిన్సిపాల్ ప్రభావతి ఆకాంక్షించారు.

చిరుధాన్యాలతో పోషకాహార ఉత్పత్తుల తయారు



ర్యాలీలో అంగన్‌వాడీ సిబ్బంది

కేవీబీపురం, ఆగస్టు 29: చిరుధాన్యాల ద్వారా పోషకాహారాలను తయారు చేయవచ్చని కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త శ్రీలత చెప్పారు. గురువారం కేవీబీపురంలో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. చిరుధాన్యాలతో తయారు చేసుకునే పోషకాహార ఉత్పత్తులను, విలువలను వివరించారు. సజ్జలు, రాగులు, కొర్రలతో పోషకాహార వస్తువులను తయారు చేసి గర్భవతులు, బాలింతలు, పిల్లలకు అందించవచ్చన్నారు. అనంతరం స్వచ్ఛతా పక్వాడా ర్యాలీని నిర్వహించారు. సూపర్‌వైజర్లు కల్పలత, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమ్మేళనం జయప్రదానికి పిలుపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నేతలు

వరదయ్యపాళెం, ఆగస్టు 29: విశాఖలో సెప్టెంబరు 1,2,3 తేదీల్లో జరిగే జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేద్దామని ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవాధ్యక్షులు ఆంబాకం చిన్నిరాజ్ అన్నారు. వరదయ్యపాళెం బస్టాండు వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దొడ్డి సిద్ధులయ్య, నాపా కృష్ణమూర్తి, చంద్ర, సీపీఐ మండల కార్యదర్శి తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాద పరిష్కారానికి ఉమ్మడి సర్వే



అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దారు రాజశేఖర్

వరదయ్యపాళెం, ఆగస్టు 29: చెదురుపాకం రెవెన్యూ బత్తలవల్లంలో గురువారం వివాదాస్పద భూమిని రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు రాజశేఖర్ మాట్లాడుతూ రెవెన్యూ హద్దులను మ్యాప్ ద్వారా గుర్తిస్తామన్నారు. రెండు శాఖలు చొరవ తీసుకుని సమగ్ర సర్వే ద్వారా వివాదాన్ని పరిష్కరిస్తామని తెలిపారు. త్వరలో రెవెన్యూ, అటవీశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి సర్వే నిర్వహిస్తామన్నారు.

డిగ్రీ కళాశాలలో హెల్త్‌కేర్ సెంటర్ ప్రారంభం

శ్రీకాళహస్తి, ఆగస్టు 29: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం హెల్త్‌కేర్ సెంటర్‌ను ప్రిన్సిపాల్ ఎం.శ్రీలత ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినపుడు కొంతసేపు విశ్రాంతి తీసుకోవడానికి వీలుపడుతుందన్నారు. ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ, అధ్యాపకులు బాపనయ్య, తులసి, రమేష్‌బాబు, నాగయ్య, పరంధామయ్య, సునీత పాల్గొన్నారు.

నాగలాపురం ఎస్‌ఐగా సునీల్ బాధ్యతల స్వీకారం



నాగలాపురం, ఆగస్టు 29: స్థానిక ఎస్సైగా సునీల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గాజులమండ్యం ఎస్సైగా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా నాగలాపురానికి వచ్చారు. శాంతి భద్రతలపరిరక్షణకు, ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తానని తెలిపారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

మాజీ ఉప రాష్ట్రపతికి స్వాగతం



రేణిగుంట రైల్వేస్టేషన్‌లో వెంకయ్యనాయుడు

రేణిగుంట, ఆగస్టు 29: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. కడప జిల్లా ఎర్రగుంట్లలో తెలుగు భాష దినోత్సవంలో హాజరయ్యేందుకు గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో ఇక్కడకు చేరుకున్న ఆయనకు బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి స్వాగతం పలికారు. కొంతసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం రోడ్డు మార్గాన రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకుని ముంబై ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని తిరిగి మధ్యాహ్నం 3గంటలకు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో రాత్రి 8 గంటలకు రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. రోడ్డు మార్గాన తిరుపతి బయలుదేరి అక్కడ బస చేసి ఉదయం హైదరాబాద్ తిరుగు ప్రయాణమవుతారు.

పోగొట్టుకున్న ఆభరణం అప్పగింత



శ్రీకాళహస్తి, ఆగస్టు 29: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పోగొట్టుకున్న బంగారు గొలుసును తిరిగి భక్తునికి అప్పగించారు. వివరాలు ఇలా.. హైదరాబాద్‌కు చెందిన పి.నారాయణ మంగళవారం స్వామి,అమ్మవార్ల దర్శనానికి వచ్చాడు. ఈ క్రమంలో రెండు తులాల బంగారు గొలుసును ఆలయంలో పోగొట్టుకున్నాడు. ఆలయ సిబ్బంది దానిని గుర్తించి ఎస్పీఎఫ్ సిబ్బందికి అందజేశారు. నారాయణ ఫోన్ ద్వారా ఎస్పీఎఫ్ సిబ్బందిని సంప్రదించి గురువారం ఆలయానికి వచ్చాడు. అతను చెప్పిన ఆధారాలు సరిపోవడంతో గొలుసును అప్పగించారు. ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీఎఫ్ సిబ్బంది ఉమాపతి, జయరామానాయుడు, ప్రవీణ్ కుమార్, సురేంద్రరెడ్డి, సిబ్బంది తేజ్‌కుమార్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు సీఐగా జయచంద్ర




జయచంద్ర- శుభన్ నాయక్

ఏర్పేడు, ఆగస్టు 29: ఏర్పేడు సీఐగా జయచంద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ పనిచేసిన శ్రీరామ శ్రీనివాసులు తిరుపతి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఎస్‌ఐ జిలానీని నెల్లూరు వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో శుభన్ నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామ శ్రీనివాసులకు వీడ్కోలు పలుకుతూ సన్మానించారు.

ఇసుక అక్రమ రవాణా కట్టడికి చర్యలు

ఏర్పేడు, ఆగస్టు 29: మండలంలో ఇసుక అక్రమంగా తరలించకుండా తహసీల్దారు భార్గవి చర్యలు చేపట్టారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు మండలంలోని మోదుగులపాళెం, పెనుమల్లం, పెనగడం, బండారుపల్లి, ఎండీపుత్తూరు, మునగలపాళెం గ్రామాల స్వర్ణముఖి నది తీరంలో ఇసుకను అక్రమార్కులు తరలించకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులను ఉదయం, సాయంత్రం ఇద్దరు వంతున అక్కడ విధులు కేటాయించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఏర్పేడు, ఆగస్టు 29: మండలంలో 19 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు ఆమె తల్లిదండ్రులు ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.82 కోట్లు

తిరుమల, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.82 కోట్లు లభించింది. మంగళవారం భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. బుధవారం 76,772 మంది దర్శించుకున్నారు. 30,293 మంది తలనీలాలు సమర్పించారు.

వాడుకభాష పితామహుడికి నివాళులు




శ్రీకాళహస్తిలో గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు- పిచ్చాటూరులో జానపద వేషధారణ విద్యార్థులతో మన సంస్కృతి కళా సంస్థ బృంద సభ్యులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 29: కాసాగార్డెన్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం తెలుగు భాష దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాగా 7వ తరగతి విద్యార్థిని గీతిక తండ్రి సుబ్బారావు పాఠశాల వసతి గృహంలో 8 గదులు కిటికీలకు సరిపడే మెష్‌ను విరాళంగా అందజేశారు. ప్రిన్సిపాల్ ప్రభావతి ఆయనను అభినందించారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గిడుగు సేవలను అధ్యాపకులు సంక్రాంతి రాజేంద్రుడు, వర్మ, సునీత, సుభాషిణి, రోహిణి కొనియాడారు. తొట్టంబేడు మండలం పెద్దకన్నలి జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. **బుచ్చినాయుడుకండ్రిగ:** కల్లివెట్టు, బీఎన్‌కండ్రిగ, పల్లమాల ఉన్నత పాఠశాలల్లో తెలుగుతల్లికి, గిడుకు రామ్మూర్తి చిత్రాలకు పుష్పాలంకరణ చేశారు. తెలుగు తల్లి, ఇతర కవుల అలంకరణతో విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి మాట్లాడుతూ వ్యవహారిక భాషోద్యమంతో తెలుగు భాషకు జీవం పోసిన గిడుగు రామమూర్తి చిర్మస్మరణీయులన్నారు. సృజనాత్మకత భాషాపోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, రూపేష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **వరదయ్యపాళెం:** పాండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. గోవర్ధనపురం పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. పౌర హక్కుల సంస్థ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుత్తి త్యాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ఏర్పేడు:** పాపానాయుడు పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిడుగు భాషోద్యమ సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సువర్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్‌పోటీలు, వాలీబాల్, పరుగుపందెం పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు సునీత, పీఈటీ గోవిందరాజులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పిచ్చాటూరు:** జేబీఆర్ స్కూలు వేడుకల్లో ఎంఈవో హేమమాలిని పాల్గొన్నారు. జేబీఆర్ పాఠశాలలో జానపద పాటల కార్యక్రమం జరిగింది. నిర్వాహకుడు కలకడ రెడ్డప్ప పల్లె పాటలు, లాలి పాటలు, జోల పాటలు, కోలాటం, చెక్క భజన, పండరి భజన కార్యక్రమాలతో పిల్లలను అలరించారు. జానపద వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. **సత్యవేడు:** సత్యవేడు జడ్పీ హైస్కూల్‌లో వ్యాసరచన, చిత్రలేఖన బహుమతులు అందించారు. పుదుకుప్పం తమిళ పాఠశాలలో విద్యార్థుల వేషధారణ అలరించింది.

రేణిగుంట విద్యార్థులకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్



రేణిగుంట, ఆగస్టు 29: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు కుస్తీ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ నెల 25, 26 తేదీల్లో జరిగిన గ్రాప్లింగ్ కుస్తీ పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో 36 బంగారు పతకాలు, 12 రజత పతకాలు, 7కాంస్య పతకాలు సాధించారు. ఫలితంగా ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసమైంది. విజేతగా నిలిచిన బాల బాలికల జట్లు వచ్చే నెల చివరి వారంలో హర్యాణాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధనం, ఆర్గనైజర్ కార్యదర్శి రేఖారాణి, గ్రాప్లింగ్ రాష్ట్ర అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ, పూర్వ విద్యార్థులు గురువారం అభినందించారు.

ఆస్పత్రిలో వైద్యుల భర్తీకి చర్యలు : ఎమ్మెల్యే ఆదిమూలం



సమస్యలను కలెక్టర్‌కు ఫోన్‌లో వివరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, ఆగస్టు 29: ప్రభుత్వాసుపత్రిని ఎమ్మెల్యే ఆదిమూలం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. గైనకాలజిస్ట్, అనస్తీషియా డాక్టర్లు డిప్యూటేషన్‌పై వారంలో ఒకరోజు వస్తున్నారని, ఏఎన్‌ఎంలు, సిబ్బంది కొరత ఉందని గుర్తిం వెంటనే కలెక్టర్, వైద్య శాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేశారు. సమస్యను వివరించారు. నీటిశుద్ధి ప్లాంటుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. డాక్టర్ సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పరమశివం, చిన్న, బాల తదితరులు పాల్గొన్నారు.**వరదయ్యపాళెం:** బత్తలవల్లం పంచాయతీలో ప్రజలకు నష్టం కలిగించే పనులను ఆపాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. అధికారులు అటవీశాఖ అధికారులు తైలం మొక్కలను నాటడానికి రావడంతో గ్రామస్థులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే గురువారం డీఎఫ్‌వో సతీష్, జేసీ శుభం బన్సల్‌ను కలిశారు. ప్రజల ఇబ్బందులను గమనించాలని కోరారు. డీఎఫ్‌వో స్పందిస్తూ వేరే దగ్గర మొక్కలను నాటుకుంటామని తెలిపారు.

సచివాలయాల్లో అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశమివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఏర్పేడు, ఆగస్టు 29: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించాలని గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు కోరారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర జిల్లాల బదిలీల్లో అంతర్ జిల్లాల బదిలీలకు సంబంధించి నియమ నిబంధనలు రూపొందించన వివిధ జిల్లాలో లోకల్ క్యాటగిరి కింద పనిచేస్తున్నవారు కుటుంబాలకు దూరంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు.

జాతీయ ఉత్తమ టీచరుకు సన్మానం



సురేష్‌ను సన్మానిస్తున్న డీవైఈవో ప్రభాకర్‌రాజు

శ్రీకాళహస్తి, ఆగస్టు 29: ఊరందూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ ఉత్తమ టీచరుగా ఎంపికైన కూనాటి సురేష్‌ను గురువారం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రాజు ఘనంగా సన్మానించారు. సురేష్ విద్యాశాఖకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవోలు బాలయ్య, బాబయ్య, ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



తెలుగు తల్లి వేషధారణలో విద్యార్థులు

రేణిగుంట, ఆగస్టు 29: తపస్య పాఠశాలలో గురువారం ఘనంగా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పాఠశాల అధినేత విక్రమ్‌శాలి, డైరెక్టర్ అనూషలు మాట్లాడుతూ వాడుక భాష ఉద్యమానికి గిడుగు రామమూర్తి చేసిన సేవలను వివరించారు. విద్యార్థినులు తెలుగు తల్లి వేషధారణతో ఆకట్టుకున్నారు. క్విజ్ విజేతలకు బహుమతులను అందజేశారు.

పేదలకు అన్నదానం

శ్రీకాళహస్తి, ఆగస్టు 29: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద డొక్కా సీతమ్మ స్ఫూర్తితో జనసేన ఆధ్వర్యంలో గురువారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత హాజరై సుమారు 500 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ప్రతివారం పేదలకు అన్నదానం చేయడం సంతోషకరమన్నారు. పేట చంద్రశేఖర్, చిరంజీవి, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ చొరవతో కాజ్‌వేకు మరమ్మతులు



పిచ్చాటూరు, ఆగస్టు 29: ఎస్‌ఐ వెంకటేష్ సహకారంతో ద్వారకానగర్ కాజ్‌వేకు గురువారం మరమ్మతులు చేపట్టారు. ద్వారకానగర్ వద్ద అరుణానదిపై నిర్మించిన సిమెంటు కాజ్‌వే ధ్వంసమై ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గం ద్వారా పిచ్చాటూరు, నాగలాపురం మండలాల ప్రజలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు పరిస్థితిని గుర్తించిన ఎస్‌ఐ దగ్గరుండి కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ టిప్పర్లతో మట్టి తోలించారు. జేసీబీ యంత్రం సాయంతో రోడ్డు మరమ్మతు పనులు చేయించారు. దీంతో రెండు మండలాల ప్రజలు వెంకటేష్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా మహా రుద్రాభిషేకం



వడమాలపేట, ఆగస్టు 29: స్థానిక భవానీ శంకర్ దేవాలయంలో మహాశివుని జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం మహాశివుడి మహాలింగానికి వేదమంత్రాలతో పంచామృత అభిషేకం నిర్వహించారు. రుద్ర గమకాలు పటిస్తూ భక్తుల శివనామ స్మరణ నడుమ మహారుద్రాభిషేకం నిర్వహించారు. పురోహితులు శివ, సాయిల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో రుద్రహోమం, శాంతి హోమం చేశారు. మహాశివుని లింగాన్ని పూలమాలలతో అలంకరించిహారతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పుత్తూరు టౌన్, ఆగస్టు 29: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా డిప్యూటీ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని పరమేశ్వర మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుష్టువ్యాధి, సీజనల్ వ్యాధులపై వగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రమేష్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మోదీ సారథ్యంలోనే దేశాభివృద్ధి : బీజేపీ

పుత్తూరు టౌన్, ఆగస్టు 29: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు పేర్కొన్నారు. గురువారం కేరళ రాష్ట్రం పాలక్కడ్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు వర్క్‌షాప్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిషిధరాజు బీజేపీ సభ్యత్వ నమోదుకు సంబంధించి కేరళ, ఏపీ రాష్ట్రాలకు ఇన్‌చార్జిగా వ్యవవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బూత్‌కు 200 మంది వంతున సభ్యత్వ నమోదు చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మహిళా మోర్చా సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాకీ క్రీడా ప్రదర్శన



వడమాలపేటలో రోడ్డుపై విద్యార్థుల హాకీ ప్రదర్శన

వడమాలపేట, ఆగస్టు 29: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం హాకీ స్టిక్స్‌తో ర్యాలీ నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జన్మదినం కావడంతో విద్యార్థులు రోడ్డు చేసిన హాకీ క్రీడా ప్రదర్శన ఆకట్టుకుంది. ర్యాలీలో పిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు పాల్గొన్నారు.

పరిశ్రమల మంత్రితో ఎమ్మెల్యే భానుప్రకాష్ భేటీ



పుత్తూరు టౌన్, ఆగస్టు 29: నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపించి యువతకు ఉపాధి కల్పించడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ స్పష్టం చేశారు. అమరావతిలో గురువారం ఆయన పరిశ్రమల మంత్రి టీ.జీ. భరత్‌ను ఆయన కలిశారు. పరిశ్రమల స్థాపనలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. విజయపురం మండలం కోసలలో పారిశ్రామిక అభివృద్ధి పార్కును ఏర్పాటు చేయాలని, టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటుకు పరిశీలించాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని భానుప్రకాష్ తెలిపారు.

పుత్తూరులో తెలుగు భాష వేడుకలు



పుత్తూరు టౌన్, ఆగస్టు 29: పట్టణంలోని మెయిన్ స్కూలులో గురువారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, తెలుగు ఉపాధ్యాయురాలు చెంచులక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు తెలుగుతల్లి వేషధారణతో పాల్గొన్నారు.